## క్లుప్తంగా

### కూటమి పాలనలో అస్తవ్యస్తంగా విద్యా విధానం


యూటీఎఫ్ మండల కార్యదర్శి నారాయణ

ఆకివీడు: కూటమి పాలనలో విద్యా విధానం అస్తవ్యస్తంగా తయారైందని యూటీఎఫ్ మండల కార్యదర్శి ఆర్వీఎస్.నారాయణ(విక్రమ్) ఆరోపించారు. ఆదివారం జరిగిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందని వాపోయారు. యాప్‌ల భారం అధికమైందన్నారు. బదిలీలై 40 రోజులు గడిచినా ఉపాధ్యాయులకు జీతాలు పడలేదన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిల్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త పీఆర్సీ కమిటీ గడువు ముగిసి మూడేళ్లు గడిచినా ఇంత వరకూ కమిటీని నియమించలేదని విక్రమ్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

### మావుళ్లమ్మ తల్లికి బంగారం సమర్పణ


అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం ఆదివారం సందర్భంగా ప్రధానార్చకులు మద్దిరాల మల్లిఖార్జునశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వెంకట హరీష్‌చంద్ర ప్రసాద్, అంజలి కుమారి దంపతులు 8 గ్రాముల బంగారాన్ని సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

### మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని 10, 23, 24, 37, 38వ వార్డుల్లో శ్రీమావుళ్లమ్మ జాతర మహోత్సవాలను ఆదివారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. అనంతరం శక్తి వేషధారణలు, డప్పుల వాయిద్యాలు, గరగల నృత్యాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసిన వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


పంచారామ క్షేత్రంలో నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో వేంచేసియున్న పంచారామక్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదానం ట్రస్టునకు దాతలు రూ.1,00,116 విరాళం అందజేశారు. భీమవరానికి చెందిన అల్లుమోలు కొండలరావు, మంగాదేవి దంపతులు తమ కుమారుడు హర్షిత్ యూఎస్ఏ తరపున ఈ విరాళంగా అందించారు. వీరిని ఆలయ అధికారులు సత్కరించారు.

### నిందితుడి అరెస్ట్

భీమవరం (ప్రకాశంచౌక్): దోపిడీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 26వ తేదీన మోటార్‌సైకిల్‌పై గొల్లవానితిప్ప వెళుతున్న నాగేశ్వరరావును సంజన ఆర్చి సమీపంలో దేవరకొండ ప్రభాకర్ అనే వ్యక్తి అడ్డగించి కత్తితో బెదిరించి అతని వద్ద రూ.500 దోచుకుని, ఇంకా నగదు ఇవ్వాలని బెదిరించాడు. దీనిపై బాధితుడు నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా టూటౌన్ సీఐ కాళీచరణ్ నిందితుడు ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.500, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు.

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నరసాపురం: పేదల చదువులకు సహకారం అందించడానికి స్వచ్ఛందసంస్థలు ముందుకు రావడం గొప్ప విషయమని నరసాపురం ఎంపీపీ మైలాబత్తుల సోనీ అన్నారు. రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మొగల్తూరు రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలికలు 300 మందికి పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ సోనీ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువులకు అందించిన సహకారం వృథా కాదన్నారు. కార్యక్రమంలో రాజ్‌ట్రస్ట్ చైర్మన్ గంటా రాజ్‌కుమార్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంగా సుందర్‌కుమార్, వైఎస్సార్ సీపీ సీనియర్‌నేత నల్లిమిల్లి జోసఫ్, కౌన్సిలర్లు అడిదల శ్యామల, జిల్లెళ్ల దిలీప్, దొండపాటి స్వాములు, సోడదాసి శ్రీధర్, ఇంజేటి జాన్‌కెనడీ, కాకిలేటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# బాబు మోసం.. ఇంటింటికీ వివరిద్దాం


బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ సభలో మాట్లాడుతున్న పీవీఎల్ నర్సింహరాజు


పట్టణ కమిటీ సమావేశంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రదర్శిస్తున్న దృశ్యం

**బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సభలో పీవీఎల్ వెల్లడి**

ఆకివీడు: రాష్ట్రం అమావాస్య చంద్రుడిలా మారిందని, అన్ని రంగాల్లో అంధకారం అలముకుందని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజు ఆరోపించారు. కూటమి ఏడాది పాలన సుపరిపాలన కాదని, రాక్షస పాలనకంటే దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుపరిపాలనలో తొలి అడుగు కాదు తొలి పిడుగు పడినట్లు ఉందని ఎద్దేవా చేశారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు నగర పంచాయతీ, రూరల్ మండల స్థాయి సమావేశం అజ్జమూరు గ్రామ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ చంద్రబాబు గత ఎన్నికల్లో అబద్ధాలు ఆడి అధికారాన్ని చేపట్టారని, సూపర్ సిక్స్, మేనిఫెస్టో అంటూ ప్రజల్ని మోసగించారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుజేసిన పథకాలకు పేర్లు మార్చి మొక్కుబడిగా అమలుజేస్తున్నారని ఆరోపించారు. కూటమి పాలనలో ప్రజలు ఎవరూ సంతృప్తిగా లేరన్నారు. రెడ్‌బుక్ పరిపాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఈసడించుకుంటున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారన్న నమ్మకం వారిలో బలంగా ఏర్పడుతోందన్నారు. ఏడాది పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కుంటుపడ్డాయన్నారు. రాష్ట్రం అప్పుల పాలైందని ఆవేదన వ్యక్తంచేశారు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి ఎక్కడ అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పథకాలపై నిలదీస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏదో విధంగా అరెస్టు చేయాలనే యోచనలోనే చంద్రబాబు కూటమి ఉందన్నారు. మద్యం కేసులో ఆయన్ని ఇరికించేందుకు కుయుక్తులు పన్నుతున్నారన్నారు.

**చంద్రబాబు మోసపూరిత విధానాలను తెలియజేయాలి**

గ్రామాల్లోకి వెళ్లి అసమర్థ, అక్రమ, మోసపూరిత ప్రభుత్వ విధానాల్ని ప్రజలకు వివరిద్దామని నర్సింహరాజు పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పొందిన లబ్ధి, నేడు చంద్రబాబు కూటమి పాలనలో పొందిన లబ్ధిని తెలియజేద్దామన్నారు. ఇంటింటికీ పథకం, గడప గడపకూ అభివృద్ధి పనుల్ని వివరిద్దామన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నింపిన కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపిద్దామని పిలపునిచ్చారు. ప్రతి కార్యకర్త, నాయకుడు బాబూ మోసపూరిత విధానాల్ని తెలియజేయాలన్నారు. సమావేశానికి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య అధ్యక్షత వహించగా, పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), మంతెన సునీల్‌కుమార్ వర్మ, కేశిరెడ్డి మురళీ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్ వలీ, పడాల శ్రీనివాసరెడ్డి, కిషోర్‌రెడ్డి, జీ.ధనరాజు, గుండా సుందర రామనాయుడు, జామి శ్రీనివాస్, ఎండీ.సిద్ధిక్, కమతం మహేష్, వంగా జ్యోత్స్న, గేదల అప్పారావు, గుండుగొలను సావిత్రీ, పళ్లెం అరుణ కుమారి, మోరా జ్యోతిరెడ్డి, ఎస్కే ఆరీఫ్, ఎండీ.ఆలీ, మాబూ, కట్రెడ్డి మోహన్, కఠారి రామకృష్ణ(రాము), కత్తుల శ్రీనివాస్, భూపతిరాజు బుజ్జిరాజు, సర్పంచ్‌లు గాలి సామ్రాజ్యం, చిగురుపాటి చిట్టిబాబు, ఊసల బేబీ స్నేతు, మద్దా జాషువా, కేశిరెడ్డి దిలీప్, కుంకట్ల దానయ్య, పాశం నర్సింహం, ఎరిచర్ల గ్లాడ్‌సన్, సాంబర్లిన్, కొత్తకోట ఆంజనేయులు, కొట్టు మాణిక్యాలరావు, కుర్రెళ్ల పాలు, అన్నెపు ఆంజనేయులు, షద్రక్, ఊడిగ శ్రీను, అద్దంకి ప్రసాద్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజును పార్టీ నేతలు సత్కరించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉండి: పాములపర్రులో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాములపర్రు శివారు రామాపురంలో ఉండి వైపు నుంచి గణపవరం వైపు వెళుతున్న వ్యాన్ ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి అనంతరం పాదచారుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో పాదచారుడు సప్పా సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలు కాగా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న రామకూరి వెంకటేశ్వరరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రేపు ఫీల్డ్ కౌన్సిల్ సమావేశం

ఆకివీడు: ఈనెల 29న ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్ కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశం జరుగనుందని అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జీ.డేవిడ్ లివింగ్ స్టన్, డీ.ఏలియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, సంఘ కాపరులు సకాలంలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

# ఉపాధి పనుల అవకతవకలపై చర్యలేవి?

వీరవాసరం: నీతి నిజాయతీతో పాలన సాగిస్తామంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా ఆ పార్టీల నేతలు మాత్రం పెద్దెత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో సైతం అవకతవకలు చేసి సొమ్ము కాజేస్తున్నారు. అక్రమాలను గుర్తించిన అధికారులు సైతం వీటిపై చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరవాసరం మండలం మెంటేపూడి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉపాధి హామీ పనులకు వెళ్లకుండానే మస్టర్లో పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వ సొమ్మును కాజేశారు. ఒక పనిని 20 మంది చేస్తే సుమారు 45 నుంచి 50 మంది పేర్లను మస్టర్లలో నోట్ చేసి ఆ డబ్బులు నొక్కేశారు. హైదరాబాదులో ఉన్న వారు సైతం ఇక్కడ పనిచేస్తున్నట్టు మస్టర్లో వేసుకొని డబ్బులు దోచుకుంటున్నారు. దీంతో గ్రామంలో రూ.3 నుంచి రూ.4 లక్షల మేర అవినీతి జరిగిందని గ్రామస్తుడు పత్తుల టైసన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మూడు రోజుల క్రితం విచారణ నిర్వహించిన అధికారులు ఉపాధి పనుల్లో అవినీతిని గుర్తించారు. అయితే ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ముక్కునవేలేసుకుంటున్నారు.


మెంటేపూడిలో విచారణ చేస్తున్న దృశ్యం (ఫైల్)

**చింతలకోటి గరువులో అవకతవకలపై ఫిర్యాదు**

చింతల కోటి గరువు గ్రామానికి చెందిన ఉపాధి హామీ పనుల్లో సైతం పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని చింతలకోటి గరువు ఉప సర్పంచ్ దాసరి మాణిక్యాలరావు వెలుగులోకి తీసుకు వచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు, ప్రస్తుత ఎంపీటీసీ కొల్లిపర శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల పేర్లపై పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందన్నారు. ఏమాత్రం పనులకు వెళ్లకుండానే ఒక్కో పేరుమీద 11 రోజుల నుంచి 180 రోజుల వరకు ఉపాధి హామీ పనులు నిర్వహించినట్లు మస్టర్లో ఉంది. పని ప్రదేశంలో వారి ఫొటోలు లేకపోయినా మస్టర్లో మాత్రమే ఉంచడం జరిగింది. ఈ విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని దాసరి మాణిక్యాలరావు వివరించారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సొమ్మును తిరిగి ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### ఉప్పలూరులో కలాంకు ఘన నివాళి

ఉండి: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని మండలంలోని ఉప్పులూరులో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మానవత శాఖ అధ్యక్షుడు డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియా అనే బిరుదు పొందిన అద్భుత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని, ఆయన్ను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ఈ రోజు దేశం ఆయుధ సంపదతో శత్రు దుర్భేద్యంగా ఉందంటే అబ్దుల్ కలాం కారణమని అన్నారు. కార్యక్రమంలో మండల కోచైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, కోశాధికారి కేటీఎస్ సత్యనారాయణ, ఏడు కొండలు, చింతడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మానవత ప్రతినిధులు

### సామూహిక గాయత్రి నామజపం

యలమంచిలి: మండలంలోని శిరగాలపల్లిలో శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో ఆదివారం అక్షర కోటి గాయత్రి సామూహిక జపం ఘనంగా నిర్వహించారు. గతేడాది కల్వకొలను చిత్తరంజన్ దాస్ స్మారక సేవా సంస్థ అయోధ్యలో పూజ్య గురుదేవులు కల్వకొలను శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో లోక శాంతి, విశ్వ కల్యాణ కోసం జప యజ్ఞం చేశారు. దాని కొనసాగింపుగా నవంబర్ ఒకటి వరకు విశ్వవ్యాప్తంగా అక్షర కోటి గాయత్రి జపం జరుగుతుంది. ప్రతిరోజూ జపతలు వారి ఇళ్లలోనే గాయత్రి జపమాచరిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం శిరగాలపల్లిలో స్థానిక సంఘ అధ్యక్షులు గుత్తిన నరసింహమూర్తి (బాబ్జీ), అమలాపురం జోన్ సమన్వయకర్త మిర్తిపాటి వేంకట రామయ్య శర్మల నేతృత్వంలో విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి గాయత్రి సామూహిక జపం చేశారు. ఈ కార్యక్రమంలో 10 మంది జపతలు పాల్గొన్నారు. జపమానంతరం 11 మార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. చివరగా ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రాచర్ల అన్నాజీరావు శర్మ, చల్లా విశ్వేశ్వరరావు (నల్లయ్య ), శంకరమంచి చటర్జీ శర్మ, మిర్తిపాటి సూర్యనారాయణమూర్తి శర్మ, గోటేటి వెంకటేశ్వరరావు శర్మ, శివసత్య రమణ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


శిరగాలపల్లిలో అక్షర కోటి గాయత్రి సామూహిక జపం చేస్తున్న దృశ్యం

### పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

నరసాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం మొగల్తూరు శాఖ యూనిట్ ఎన్నిక మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఆయన ప్రకటించారు. అధ్యక్షుడిగా పోడూరు జూనియర్ అసిస్టెంట్ ఎ.దేవికుమార్, ఉపాధ్యక్షుడిగా నర్సాపురం పీఆర్ డివిజన్ ఆర్ఎస్ఆర్పీ కుమార్, కార్యదర్శిగా మొగల్తూరు మండలం ఎంఎస్ఎస్ఎన్ శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా ల్యాబ్ సహాయకుడు (యలమంచిలి) వి.శ్రీనివాస రావు, ట్రెజరర్‌గా మొగల్తూరుకి చెందిన వీవీఎస్‌సీహెచ్ వర్మ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు అధికారిగా ప్రసన్న కుమార్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని నరసాపురం, మొగల్తూరు ఎంపీడీఓలు అభినందించారు.

### ఈనాం భూములకు చట్టబద్ధత కల్పించాలి

పెనుగొండ: ఈనాం భూములకు చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 68 వేల ఎకరాలు ఇనాం భూములు ఉండగా, ఐదు లక్షల మంది హక్కుదారులు ఉన్నారన్నారు. వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నపుడు భూమిని అమ్ముకోవడానికి లేక నానావస్థలు పడుతున్నారన్నారు. రిజిస్ట్రేషన్లు కావడం లేదన్నారు.

### ధ్యానం సర్వరోగ నివారిణి


పిరమిడ్ మాస్టర్ గ్రంధి కృష్ణమూర్తిని సత్కరిస్తున్న పిరమిడ్ సభ్యులు

పెనుమంట్ర: ధ్యానం ద్వారా మానవుడు తన అంతట తానుగా సర్వ రోగాలను నివారించుకోవచ్చునని తాడిమల్లకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ గాంధీ కష్ణమూర్తి అన్నారు. పెనుమంట్రలోని ఉప సర్పంచ్ భూపతి రాజు శ్రీనివాసరాజు జ్ఞాన మందిరంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన పలువురు సభ్యులతో సామూహిక ధ్యానం చేయించారు. జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం సెప్టెంబర్ 16 నుంచి 22 వరకు తిరుపతిలో నిర్వహించే ధ్యాన యజ్ఞం మహా కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు భూపతిరాజు రాధా, ఎం.లక్ష్మీ మౌనిక, పద్మ, ఇందిరా భవాని, నాగ ధన లక్ష్మి, తులసమ్మ, పడాల సూర్యనారాయణ రెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# షాపింగ్ కాంప్లెక్స్‌లు ఎక్కువ.. ఆదాయం తక్కువ

- ఆదాయం పెంపుపై నరసాపురం మునిసిపాలిటీ నిర్లక్ష్యం
- మునిసిపాలిటీకి గుదిబండగా అల్లూరి కాంప్లెక్స్

నరసాపురం: ఆదాయ మార్గాలు పెంచుకునే విషయంలో నరసాపురం మున్సిపాలిటీ తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తోంది. పట్టణంలో మునిసిపాలిటీకి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ల పరిస్థితిని గమనిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. పట్టణంలో మొత్తం 14 మునిసిపల్ కాంప్లెక్స్‌లు, వాటిలో 250 వరకూ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా మునిసిపాలిటీకి కేవలం నెలకు రూ.2.85 లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. చాలా షాపులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. సెంటర్‌లో ఉన్న కీలకమైన అల్లూరి సత్యనారాయణరాజు షాపింగ్ కాంప్లెక్స్‌లో కూడా షాపులు భర్తీకాని పరిస్థితి.

**నిబంధనలకు విరుద్ధంగా లీజులు**

ఇక షాపుల లీజుల విషయంలో కూడా అధికారులు నిబంధనలకు నీళ్లు వదలడం, వ్యాపారులతో లాలూచీ పడటంతో అద్దెలు పెరగని పరిస్థితి. దీర్ఘ కాలంపాటు తరతరాలుగా ఒకరే పలుకుబడితో షాపులు దక్కించుకోవడం, తక్కువ లీజులు చెల్లిస్తుండడం గమనార్హం. లోపాలను సరిదిద్ది, మునిసిపల్ అధికారులు ఆదాయం పెంచుకోవడానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్‌ల నిర్మాణం ప్రణాళికాబద్ధంగా, వ్యాపారాలకు అనువుగా లేకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఈ కారణం వల్లనే షాపుల భర్తీ జరగడంలేదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కొత్త కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అవకాశం ఉన్నప్పటికీ మునిసిపాలిటీ దృష్టి పెట్టడంలేదు.


అంతంతమాత్రంగా ఆదాయం వస్తున్న అల్లూరి షాపింగ్ కాంప్లెక్స్

**గుదిబండగా అల్లూరి కాంప్లెక్స్**

మున్సిపాలిటీకి కీలకమైన కాంప్లెక్స్‌గా పట్టణ నడిబొడ్డున ఉన్న అల్లూరి సత్యనారాయణరాజు కాంప్లెక్స్. అయితే ఈ కాంప్లెక్స్ కట్టిన నాటినుంచి ఆదాయంలేక, మున్సిపాలిటీకి గుదిబండగా మారింది. ఆలోచనాత్మకంగా కాంప్లెక్స్ నిర్మాణం చేయకపోవడంతో వ్యాపారాలకు ఇప్పటికీ అనువుగా లేకపోవడంతో సరైన ఆదాయం సమకూరడంలేదు. కాంప్లెక్స్‌పై అంతస్థులు పూర్తిగా ఖాళీగా నిరుపయోగంగా ఏళ్ల తరబడి దర్శనమిస్తున్నాయి. ఆదాయంలేని అల్లూరి కాంప్లెక్స్‌ను కార్పొరేట్ తరహాలో అభివృద్ధిచేయాలని మూడేళ్లక్రితం అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తీవ్రంగా ప్రయత్నించారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో కాంప్లెక్స్‌ను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేసేలా, వ్యాపారులకు నష్టంలేకుండా పాతవారే తిరిగి వ్యాపారాలు చేసుకునేలా ప్రణాళిక తయారు చేయించారు. అయితే అది అమలుకాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ నరసాపురం మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

**ఆదాయం పెంపుపై దృష్టి పెడతాం**



మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ఆదాయం పెంపుపై దృష్టిపెడతాము. అల్లూరి కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులను పూర్తిస్థాయిలో భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఖాళీగా ఉన్న కొన్ని షాపులను ఇటీవల భర్తీ చేశాం. ఆదాయం పెంపునకు సంబంధించి అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. అల్లూరి కాంప్లెక్స్‌కు ఆదాయం రాని మాట వాస్తవమే.

– బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: యండగండి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉణుదుర్రు గ్రామ పరిధిలో గృహావసరాలతో పాటు ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### నేడు హోం మంత్రి ఆకివీడు రాక

ఆకివీడు: రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం ఆకివీడు రానున్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక వెలం పేట నుంచి నిర్వహిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు మోటుపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

### 31న భీమవరంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 31వ తేదీన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ, ధరణి మోటార్స్, ముత్తూట్ ఫైనాన్స్, జగదీశ్ మెరైన్ వంటి కంపెనీల్లో పాల్గొంటాయని, 18 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు శ్రీనివాస్ 86885 94244, రాధిక 94408 38388 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.20 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆదివారం ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీటీసీ చిన్నావరపు రాంబాబు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ నిషేధం సామాజిక బాధ్యత

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ నిషేధం సామాజిక బాధ్యత అని, సమాజంలో ప్లాస్టిక్‌ను రూపుమాపాలని జిల్లా వెనుకబడిన తరగతుల హాస్టల్ ఇన్‌చార్జి అధికారి కలిదిండి వెంకటేశ్వరావు అన్నారు. భీమవరం 5వ వార్డు ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలుర హాస్టల్స్‌లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ప్లాస్టిక్‌ని నిషేధించి గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

### వ్యభిచార గృహంపై దాడి

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక పాతూరు ప్రాంతంలో ఓ గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం పట్టణ సీఐ ఆ ప్రాంతానికి వెళ్లి తనిఖీ చేశారు. సీఐ ఆది ప్రసాద్ వెల్లడించిన వివరాల మేరకు పాతూరులోని ఓ గృహాన్ని తనిఖీ చేయగా ఒక విటుడు, నిర్వాహకుడు, ఓ మహిళను అదుపులో తీసుకొని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

### కవి ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం

తణుకు అర్బన్: మహాకవి గుర్రం జాషువా వర్ధంతి పురస్కరించుకొని ఈ నెల 24న తెనాలిలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో తణుకుకు చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ చూపించిన కవితా ప్రతిభకు ఉత్తమ పురస్కారం దక్కింది. తాను రచించి, చదివి వినిపించిన రక్షించుకుందాం మహిళా జగతిని అనే కవితకు విశేష స్పందన లభించినట్లు కవి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ వ్యవస్థాపకులు డాక్టర్ పెద్దింటి యోహాన్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ దేవులపల్లి ప్రభుదాస్, గురిందపల్లి సుజ్ఞానరాజు, విజయరావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు వివరించారు.